సాక్షి వికారాబాద్

సోమవారం ၊ 9 ၊ సెప్టెంబర్ ၊ 2024



భారీ వర్షం..

శనివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. వరద నీరు చెరువుల్లోని చేరడంతో మత్తటి దుంకుతున్నాయి. 8లో▸



దొంగల ముఠా అరెస్టు

గొర్రెలు, మేకల దొంగతనానికి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



బడ్జెట్ రాక.. పనులు సాగక!

బొంరాస్‌పేట మండలంలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

ఖగోళ శాస్త్రంలో రఘుప్రసాద్‌కు డాక్టరేట్



కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన రఘుప్రసాద్ ఉస్మానియా వర్సిటీ నుంచి ఖగోళశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రుక్మిణి పర్యవేక్షణలో ఖగోళశాస్త్రంలో నక్షత్రాల గమనం అనే అంశంపై పరిశోధనలు చేసి గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ వరించిందని ఆయన వెల్లడించారు. పట్టణానికి చెందిన ఎం.నర్సింలు, నిర్మల దంపతుల కుమారుడు రఘుప్రసాద్ జాతీయ, అంతర్జాతీయ సంపాదకీయాల్లోనూ పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు రఘుప్రసాద్‌ను అభినందించారు.

వర్షాలకు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్



కుల్కచర్ల: భారీ వర్షాలు కురుస్తున్నందున కళాశాలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నందున పాఠశాలకు రాకపోకలు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్లు గుంతలమయంగా మారాయని బైక్‌పై వెళ్లే వారు నిబంధనలు పాటిస్తూ నిదానంగా వెళ్లాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో వానలు ఆగాలి

చిలుకూరులో అర్చకులు, భక్తుల ప్రదక్షిణలు



ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, భక్తులు

మొయినాబాద్: తెలుగు రాష్ట్రాలపై వరుణదేవుడి ప్రకోపం ఆగాలని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆలయంలో అర్చకులు, భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. వరదలు, విధ్వంసం, అనారోగ్యం, గాయాలు, విపత్తులు, ఆకస్మిక మరణాల నుంచి రక్షణకోసం ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సంక్షోభ సమయంలో గోవింద నామస్మరణలు చేస్తూ ప్రదక్షిణం చేయాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనాలంటే వర్షాలు ఆగాలన్నారు. అందుకోసం స్వామివారిని ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేశామన్నారు. వరద సహాయానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.


పార్కుల నిర్వహణ పట్టదా?

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: గత ప్రభుత్వ హయాంలో జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు నిర్వహణ లోపంతో శిథిలం కావాల్సిన పరిస్థితి నెలకొందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి కమాన్ ప్రాంతంలోని అర్బన్ ఫారెస్ట్ పార్కును ఆదివారం ఉదయం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పార్కును కలియతిరిగిన ఆమె వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రూ.59 లక్షల వ్యయంతో ఈ పార్కును అందంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నిర్వహణ లేకపోవడంతో ఆయా పరికరాలన్నీ ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి నిర్వహణ బాధ్యత చేపడుతూ పార్కుకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షర్ఫుద్దీన్ హమెద్, జనార్దన్, కృష్ణారెడ్డి, శంకర్, షేక్ అఫ్జల్, అర్జున్, నర్సింగ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కలంతో గీసిన కాళోజి చిత్రం (ఇన్‌సెట్‌లో) అశోక్

కలం గీసిన కాళోజీ చిత్రం

పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా తెలంగాణది అని నినాదం ఇచ్చిన మహనీయుడు కాళోజీ నారాయణరావు. సెప్టెంబర్ 9న ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నాం. సోమవారం తెలంగాణ భాషాదినోత్సవం సందర్భంగా యాంకి గ్రామానికి చెందిన సున్నపు అశోక్ తన కలంతో కవి కాళోజీ బొమ్మని గీసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. - దౌల్తాబాద్



బోటింగ్ చేస్తున్న యువత

జలకళ


కోట్‌పల్లికి పర్యాటకుల తాకిడి

వరద ఉధృతి తగ్గడంతో కోట్‌పల్లికి పర్యాటకులు పెద్ద ఎత్తున వచ్చారు. ఆదివారం మత్తడి అందాలను తిలకించేందుకు వచ్చిన యువతకు అనుమతి నిరాకరించడంతో నిరాశ చెందారు. అలుగు నీరు ప్రవహిస్తున్న రోడ్డుపైనే కేరింతలు కొడుతూ గడిపారు. పలువురు సందడిగా బోటింగ్ చేశారు. - ధారూరు

ప్రగతి దారి

జిల్లా మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు

- గత డీపీఆర్‌లో రంగారెడ్డి జిల్లాకే పరిమితం
- తాజాగా జిల్లాలోని నాలుగు మండలాలను కలుపుతూ నూతన అలైన్‌మెంట్



రీజినల్ రింగ్‌రోడ్డు కొత్త ప్రతిపాదిత నమూనా

వికారాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్ జిల్లా మీదుగా వెళ్లడం దాదాపు ఖరారైంది. గతంలో ప్రతిపాదించిన డీపీఆర్(డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు) ప్రకారం పడమర ప్రాంతంలో జిల్లాకు దిగువన రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంత గ్రామాల మీదుగా వెళ్లేలా తయారు చేశారు. దీంతో రీజినల్ రింగ్ రోడ్డు జిల్లా మీదుగా ఉంటుందా..? లేదా..? అనే విషయంలో కొంత కాలంగా ప్రజల్లో చర్చలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాలతో పోలిస్తే జిల్లా సరిహద్దు ఉన్న పడమర ప్రాంతంలో ఆర్ఆర్ఆర్ హైదరాబాద్‌కు తక్కువ దూరం నుంచి నిర్మిస్తున్నారని నేతలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. మిగిలిన ప్రాంతాల్లో నగరానికి 60 నుంచి 90 కిలోమీటర్ల దూరం నుంచి ట్రిపుల్ ఆర్ నిర్మించేలా అలైన్‌మెంట్ తయారు చేయగా.. మన జిల్లాను కలుపుతూ వెళ్లే పడమర ప్రాంతంలో 50 కిలోమీటర్ల దూరం నుంచే డీపీఆర్ తయారు చేశారు. దీంతో పశ్చిమ ప్రాంతాన ఉన్న మన జిల్లాకు అన్యాయం జరుగుతుందని.. అభివృద్ధి పరిధిలోకి రాకుండా పోయే ప్రమాదముందని జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు.

ఎక్స్‌ప్రెస్ వే అథారిటీకి నూతన అలైన్‌మెంట్

ట్రిపుల్ ఆర్ పాత అలైన్‌మెంట్‌తో అన్యాయం జరుగుతుందనే విషయం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా సీఎం ఆధ్వర్యంలో ఆగస్టు 21న ఉన్నతాధికారుల సమావేశంలో పడమర భాగం అలైన్‌మెంట్‌లో మార్పు గురించి చర్చకు వచ్చినట్లు సమాచారం. గతంలో నిర్మించిన ఓఆర్ఆర్(ఔటర్ రింగ్ రోడ్డు) జాతీయ హైవే అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించగా ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ ఎక్స్‌ప్రెస్ వే అథారిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. జిల్లాకు కనెక్టివిటీ పెంచేలా డిజైన్ మార్చాలని ముఖ్యమంత్రి సూచించారని తెలుస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారుల బృందం నూతన అలైన్‌మెంట్‌తో ఎక్స్‌ప్రెస్ వే అథారిటీకి ప్రతిపాదనలు పంపినట్లు వినికిడి. ఇందుకు సంబంధించి నూతనంగా ప్రతిపాదించిన ఏరియాతో తయారు చేసిన మ్యాప్ ఒకటి నెట్‌లో అప్‌లోడ్ చేశారు.

నూతన డీపీఆర్‌లో నాలుగు మండలాలు

గతంలో తయారు చేసిన డీపీఆర్‌లో పొందుపర్చిన అలైన్‌మెంటులో పడమర ప్రాంతంలో మన జిల్లా సరిహద్దు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆలూరు–కొకుంట్ల గ్రామాల మధ్య తంగెడుపల్లి మీదుగా వెళ్లేలా ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనల్లో మన జిల్లాకు చెందిన పూడూరు, నవాబుపేట మండలాలకు చెందిన ఒకటి రెండు గ్రామాల రెవెన్యూ పరిధిలోంచి ట్రిపుల్ ఆర్ మార్గాన్ని డిజైన్ చేశారు. నూతన ప్రతిపాదనల్లో జిల్లా పరిధిలోని నాలుగు మండలాలను కలుపుతూ ట్రిపుల్ ఆర్ ఉంది. పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని పది గ్రామాలకు పైగా ట్రిపుల్ ఆర్ పరిధిలోకి వస్తుండగా.. వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని రెండు, మూడు గ్రామాలను కలుపుతూ కొత్త ప్రతిపాదనలు తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపింది.

ఫైనల్ అయ్యేలా చూస్తాం



గత పాలకులు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ విషయంలో పశ్చిమ భాగానికి అన్యాయం చేసేలా రూపొందించారు. ఈ విషయంలో గతంలో మేము ఆందోళన చేపట్టాం. ఇటీవలే ఈ విషయంపై ముఖ్యమంత్రిని కలిసి చర్చించా. రీజనల్ రింగు రోడ్డు జిల్లా మీదుగా వెళ్లేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. మన్నెగూడ సమీపం నుంచి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఫైనల్ అయ్యేలా చూస్తాం. జిల్లాకు అన్యాయం జరగకుండా ప్రజల గొంతుకను వినిపిస్తాం.

- టి.రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే

ఇదీ ప్రయోజనం

- రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మించిన చుట్టు పక్కల ప్రాంతాలు, పట్టణాలు, గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి.
- రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కనెక్టివిటీ పెరుగుతుంది. దీంతో రైతులు కూరగాయలు, ఆకు కూరలు, పళ్ల సాగు చేపట్టి నగరానికి తరలించడంతో లాభాలు పొందే అవకాశం మెరుగవుతుంది.
- ఉపాధి, ఉత్పాదకత పెరుగుతుంది.
- రోడ్డుకు రెండు వైపులా చిన్న తరహా పరిశ్రమలు వచ్చి చేరతాయి.
- భూముల ధరలు పెరుగుతాయి.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఇలా..

మండలం	గ్రామాలు
వికారాబాద్	సిద్దులూర్, కొటాలగూడ, లాల్‌సింగ్ తండా
మోమిన్‌పేట	చీమల్‌దరి, బాల్‌రెడ్డిగూడ
నవాబుపేట	అక్నాపూర్, పులిమామిడి, నారెగూడ, గంగ్యాడ, గుబ్బడి ఫత్తేపూర్, ముబారక్‌పూర్, పూలపల్లి, గొల్లగూడ, లింగంపల్లి, ఎల్లకొండ, మైతాప్‌ఖాన్‌గూడ, మాదిరెడ్డిపల్లి, సాయన్నగూడ, వట్టిమీనెపల్లి, రామన్నగూడ
పూడూరు	పెద్ద ఉమ్మెంతాల్, కంకల్, కుత్బుల్లాపూర్, మన్నెగూడ, చింతల్‌పల్లి, పుడుగుర్తి, తుర్క ఎన్కేపల్లి, రేగడిమామిడిపల్లి, అంగడిచిట్టెంపల్లి, కండ్లపల్లి, చన్గోముల్, నిజాంపేట్ మేడిపల్లి, పోతిరెడ్డిగూడ, మరియాపూర్,చీలాపూర్, కొత్తపల్లి, తిమ్మాపూర్, మిట్టకంకల్, మేడికొండ, మేడిపల్లి, మిర్జాపూర్

మహా గణపతిమ్.. మనసాస్మరామి

కలెక్టర్ దంపతుల తొలి పూజ

అనంతగిరి: కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహా గణపతికి శనివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ దంపతులు సతీసమేతంగా తొలిపూజ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. మొదలు పెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేలా చూడాలని.. కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని వేడుకున్నామన్నారు. పూజా కార్యక్రమంలో నరేందర్, అరుణ్, సతీశ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ దంపతులు

మేలైన ఉపాధి కల్పనే ధ్యేయం

- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్
- కన్హాలో ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్, చిత్రంలో అతిథులు

నందిగామ: వ్యవసాయ, అనుబంధ రంగాల విద్యార్థులకు మేలైన ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఆరో డీన్ కమిటీ సిఫార్సులు ఉన్నాయని, వ్యవసాయ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, స్టార్టప్ వాతావరణం కల్పించేందుకు అనుగుణంగా విద్యలో మార్పులు చేసినట్లు ఐసీఏఆర్ (భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ అన్నారు. కన్హా శాంతి వనంలో ఐసీఏఆర్, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ వ్యవసాయ వైస్ చాన్సలర్ల జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అగర్వాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతగా నైపుణ్యం పెంచుకుంటే అంతగా ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ విద్య అభ్యసించిన వ్యవసాయ ఆధారిత ఉద్యోగాలు పుష్కలంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విదేశాల్లో నాణ్యమైన విద్యను అందించే విశ్వవిద్యాలయాలు, సంస్థలు స్వదేశీ విద్యాలయాలతో ఒప్పందం చేసుకోవాలని విశ్వవిద్యాలయాల చాన్సలర్లకు సూచించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, 2020 జాతీయ విద్యావిధానం సిఫార్సులను వ్యవసాయ విద్యలో చేరుస్తామని వెల్లడించారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. ధ్యానంతో విద్యార్థుల్లో ఏకగ్రత పెరిగి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజ, భారతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పర్వీందర్ కౌల్, 50 మందికి పైగా వ్యవసాయ ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, వర్సిటీ అధికారులు, ప్రొఫెసర్లు, ఐసీఏఆర్ నిపుణులు పాల్గొన్నారు.



గండిపేట గేట్లను ఎత్తిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

తెరుచుకున్న జంట జలాశయాల గేట్లు

మణికొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఉస్మాన్ సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్ జలాశయాలు నిండుకుండలా మారాయి. ఉస్మాన్‌సా గర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,790 అడుగులు కాగా ప్రస్తుతం 1,788 అడుగులకు చేరింది. హిమాయత్‌సాగర్ 1,765 అడుగులు కాగా 1,763 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టానికి రెండు, మూడు అడుగుల దూరంలోనే ఉండటం, రాబోయే రోజుల్లో మరింత వర్షం పడే అవకాశం ఉండటంతో శనివారం సాయంత్రం ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పూజలు నిర్వహించి ఎత్తి నీటిని కిందకు వదిలారు. శనివారం రోజంతా మూసీ పరీవాహకంలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం సాయంత్రం రెండు గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని వదిలారు. చెరువుల పరీవాహకంలో ప్రతిరోజూ రాత్రి సమయాల్లో వర్షాలు కురుస్తుండటంతో వాగులో నీరు వస్తూనే ఉంది.

నష్టాల నివేదిక సమర్పించండి

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్



ఎర్రవల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న దివ్య దేవరాజన్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

అనంతగిరి: వర్షాలకు పాడైన పంటలు, దెబ్బతిన్న గృహాలు, నష్టపోయిన పశుసంపద వివరాల నివేదిక సమర్పించాలని సెర్ప్ సీఈఓ, జిల్లా ప్రత్యేకాధికారి దివ్యదేవరాజన్ అధికారులకు సూచించారు. ఆదివారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వర్షాలకు జరిగిన నష్టాలపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యదేవరాజన్ మాట్లాడుతూ.. వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నష్టపోయిన రైతుల వివరాల నివేదిక సమర్పించాలన్నారు. కూలిన ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ భవనాలతో పాటుగా పశుసంపద నష్టాల వివరాలను సైతం అందజేయాలని చెప్పారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ ఇంజనీర్లు దెబ్బతిన్న రహదారుల వివరాల నివేదిక తయారు చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టాల నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటల వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణాలకు భూములను కేటాయించేందుకు చర్య లు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి, వికారాబాద్ ఆర్డీఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో పంటలను పరిశీలిలన

అనంతరం సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అధికారులు పంట నష్టాన్ని తెలుసుకునేందుకు గ్రామాల్లోకి వస్తున్నారా అని ఆమె రైతులను అడిగారు. వస్తున్నారని రైతులు సమాధానమిచ్చారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రాములుగౌడ్

కుల్కచర్ల: విద్యుదాఘాతానికి గురై ఓ గ్రామ పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో శుక్రవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామపంచాయతీ సిబ్బంది అయిన రాములుగౌడ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రాములుగౌడ్‌ని కుల్కచర్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన యోగా శిక్షణ శిబిరం



అనిలేష్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కొడంగల్: గత నెల 26వ తేదీ నుంచి కొనసాగుతున్న యోగా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ప్రతిరోజు ఉదయం 5.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు యోగా తరగతులు నిర్వహించారు. యోగా గురువు అనిలేష్ ఔత్సాహికులకు నేర్పించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా అనిలేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, డీడీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, డాక్టర్ సాకేత్, డాక్టర్ హీరాలాల్, నగేష్, భీంరాజ్, వెంకటేశ్, వేణు, అశోక్‌కుమార్, దామోదర్‌రెడ్డి, ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి, బాధ్యత సేవా సమితి, వీబీఆర్ కంప్యూటర్ శిక్షణా కేంద్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా రవిగౌడ్?

తాండూరు రూరల్: మండలంలోని ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ సంగెం రవిగౌడ్‌ను డీసీసీబీ వైస్ చైర్మన్‌గా ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న మనోహర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ పోస్టు ఖాళీ ఉండటంతో డీసీసీబీ వైస్ చైర్మన్‌గా ఉన్న కురువ సత్తయ్యను చైర్మన్‌గా ప్రకటిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వైస్ చైర్మన్‌ను రవిగౌడ్‌కు ఇవ్వనున్నట్లు ఆయన వర్గీయులు తెలిపారు. ప్రస్తుతం డీసీసీబీ డైరెక్టర్‌గా కూడా రవిగౌడ్ కొనసాగుతున్నారు. సోమవారం హైదరాబాద్‌లో డీసీసీబీ కమిటీ సమావేశంలో ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

అర్హతలేని నర్సు డాక్టర్‌గా వైద్యం

పోలీసుల అదుపులో నిందితురాలు

ఇబ్రహీంపట్నం: అర్హతలేని ఓ నర్సు గైనిక్ డాక్టర్‌గా వైద్యం చేస్తుండగా ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు పట్టుకున్న సంఘటన ఇబ్రహీంపట్నంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక అనిరెడ్డి రామరక్ష ఆస్పత్రిలో గైనిక్ డాక్టర్‌గా వ్యవహరిస్తున్న ఎస్ ప్రవళిక (35)అలియాస్ శిరీషను పథకం ప్రకారం పట్టుకున్నట్లు తెలిపారు. జీఎన్ఎం కోర్సు సర్టిఫికెట్ కలిగి గైనిక్ డాక్టర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రవళికను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.



పరిగి: నారాయణపూర్‌లో పారుతున్న వరద నీరు



పరిగి: అలుగు పారుతున్న లక్నాపూర్ ప్రాజెక్ట్

భారీ వర్షం.. అతలాకుతలం

- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- పలుచోట్ల దెబ్బతిన్న పంటలు

పరిగి: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది. భారీ వరద నీరు చెరువుల్లోని చేరడంతో మత్తటి దుంకుతున్నాయి. వరద నీరు నారాయణపూర్ గ్రామాన్ని ముంచెత్తింది. హనుమాన్ దేవాలయం పక్క నుంచి వరద రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలో పత్తిపంట పూర్తిగా దెబ్బతింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. లక్నాపూర్ ప్రాజెక్ట్ అలుగు పారడంతో పర్యాటకులు భారీగా వచ్చారు. మిట్టకోడూర్ చెరువు వాగు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

అలుగు పారుతున్న ప్రాజెక్టులు

యాలాల: మండలంలో ఎడతెరపి లేకుండా వర్షం పండింది. దీంతో శివసాగర్, జుంటుపల్లి ప్రాజెక్టులు అలుగు పారాయి. ఎగువన బొంరాస్‌పేట మండలంలో సైతం భారీ వర్షం పడటంతో భారీగా వరద నీరు కాకరవేణి నదిలోకి చేరింది. దీంతో శివసాగర్ ప్రాజెక్టు అలుగు మరోమారు భారీగా ఉప్పొంగి ప్రవహించింది. దీంతో పాటు జుంటుపల్లి ప్రాజెక్టు అలుగు సైతం పారింది. శివసాగర్ దిగువన అలుగు నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో దిగువన విశ్వనాథ్‌పూర్ బ్రిడ్జి సమాంతరంగా వరదనీరు తాకింది.



పరిగి: వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంట



యాలాల: ప్రవహిస్తున్న శివసాగర్ అలుగు



యాలాల: అలుగు పారుతున్న జుంటుపల్లి ప్రాజెక్టు

వర్షానికి కూలిన ఇల్లు



దౌల్తాబాద్: మండల కేంద్రంలో భారీ వర్షానికి గ్రామానికి చెందిన బండలకాడి గోవిందమ్మ ఇల్లు కూలింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూలడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా కృషి చేయాలని ఆమె వేడుకుంటుంది.

దంచి కొట్టిన వాన



బ్రాహ్మణపల్లి వాగు వద్ద డీటీ నర్సింహులు

దోమ: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. వాగులు ఉప్పొంగడంతో గ్రామాల్లో ఉన్న ప్రతి చెరువు నిండుకుండలా మారింది. మండలంలోని గొడుగోనిపల్లి వాగుతో పాటు పాలేపల్లి, బ్రాహ్మణపల్లి వాగులు ఉప్పొంగాయి. దీంతో అటుగా వెళ్లాల్సిన వాహనదారులు, రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. బ్రాహ్మణపల్లి వాగు ఉగ్రరూపం దాల్చడంతో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఆర్ఐ రామచంద్రారావు అక్కడే ఉండి వాహనదారులను వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. గొడుగోనిపల్లి, పాలేపల్లి వాగు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పరిగి–మహబూబ్‌నగర్ వెళ్లాల్సిన బస్సులు, వాహనదారులు, ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ ఆనంద్ కుమార్ వాగుల ఉధృతి దగ్గర ఉండి పర్యవేక్షించారు.



గొడుగోనిపల్లి వాగు సమీపంలో నీట మునిగిన వరి పంట

నేడు నిమజ్జనంపై సమావేశం

తాండూరు టౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక నిమజ్జనంపై సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి హిందూ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు, వినాయక మండపాల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

నవోదయకు ఉచిత శిక్షణ

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఇందిరానగర్‌లోని శ్రీనివాస రామానుజన్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ డైరెక్టర్ ఇందిర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 99492 72300 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



వెంకటయ్య (ఫైల్)

పరిగి: గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం గధిర్యాల్ గ్రామానికి చెందిన వెంకటయ్య(57) పరిగిలోని కాళ్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పట్టణ కేంద్రంలోని బాలాజీ నగర్‌లో నివాసం ఉండగా.. శనివారం సాయంత్రం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో వెంకటయ్య మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. వెంకటయ్య పీఆర్‌టీయూలో మండల, రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టారు. పలు ప్రజా, ఉపాధ్యాయ సంఘాలు నివాళులర్పించారు.

‘గుండ్లకుంట’ మరమ్మతులకు చర్యలు

యాలాల: మండల పరిధిలోని కిష్టాపూర్ గుండ్లకుంట చెరువుకు మరమ్మతులు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్ల కుంట చెరువు నిండి దిగువన ఉన్న కిష్టాపూర్, హాజీపూర్ గ్రామాల ప్రజలు వరదనీటితో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, మాజీ సర్పంచ్ హన్మంతు, మహిపాల్ తదితరులు ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువు అలుగు ప్రాంతంలో కుంచించుకుపోవడంతో వరద నీరు దిగువకు ఉధృతంగా ప్రవహించి ఇళ్లలోకి వస్తున్నట్లు గుర్తించారు. కిష్టాపూర్, హాజీపూర్, జక్కేపల్లి ఊర చెరువుల విషయంలో అవసరమైన అభివృద్ధి పనులను అధికారులతో కలిసి గుర్తించారు. ఈ పనులను త్వరలో ప్రారంభించి వరదనీటి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని నాయకులు తెలిపారు. చెరువుల పనులను త్వరలో ప్రారంభించేలా ఇరిగేషన్ అధికారులకు సూచించారు.



గుండ్లకుంట చెరువు సమీపంలో ఇరిగేషన్ సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న నేతలు

కుమారుడిపై బెంగ

ఆస్పత్రిలో ఉరేసుకొని తండ్రి ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

యాలాల: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొడుకు గురించి బెంగపెట్టుకున్న తండ్రి.. అదే ఆస్పత్రిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన హైదరాబాద్ నగరంలో చోటు చేసుకోగా, యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామంలో విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బైండ్ల శేఖర్(50) కొడుకు కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కొడుకు విషయంలో తీవ్ర మనోవేదనకు గురైన శేఖర్ శనివారం అదే ఆస్పత్రిలోని బాత్ రూంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన అఫ్జల్‌గంజ్ పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం మృతుడి స్వగ్రామమైన కమాల్‌పూర్‌లో అంత్యక్రియలు జరిగాయి. కొడుకు విషయంలో తండ్రి మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెరువుకట్టను తొలగిస్తున్న జేసీబీ సీజ్

చౌడాపూర్ లింగంపల్లిలో ఘటన

కుల్కచర: చెరువుకట్టను ధ్వంసం చేస్తున్న జేసీబీని సీజ్ చేసిన సంఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామంలో మ్యాకలోని చెరువు కట్టగా గ్రామస్తులు పిలుచుకొనే చెరువుకట్టను జేసీబీతో ధ్వంసం చేస్తున్నారన్న సమాచారంతో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కూల్చివేతకు పాల్పడుతున్న జేసీబీని పోలీసులు సీజ్ చేసి ఠాణాకు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుకట్టను కూల్చివేయడం చట్టరీత్యా నేరమని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు జేసీబీ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై చట్ట ప్రకారం నడుచుకోవాలని ఎస్ఐ సూచించారు.



ఠాణా ఆవరణలో జేసీబీ

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- గొర్రెలు, మేకలను చోరీ చేసిన దుండగులు
- ఇద్దరి అరెస్టు, పరారీలో తొమ్మిది మంది



పట్టుబడిన దొంగలతో పోలీసులు

పూడూరు: గొర్రెలు, మేకల దొంగతనానికి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మన్నెగూడలో సీసీఎస్‌తో వాహనాల తనిఖీలు స్థానిక పోలీసులు శనివారం చేపట్టారు. ఈ క్రమంలో నంబర్‌ప్లేట్‌లు లేని రెండు స్కార్పియో కార్ల నుంచి కొందరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా వారిని పట్టుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయాలు బయట పడ్డాయి. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లాకు చెందిన ప్రభు, శేక్య, చెన్నప్ప, మారుతి, రవి, భీము, దశరథ, సంజయ్‌కుమార్, శంకర, కైలాష్ చౌహన్, కందప్పలు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి చోరీలను వృత్తిగా మార్చుకున్నారు. ఈ ముఠా సభ్యులు గొర్రెలు, మేకల మందలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు.

అనేక చోట్ల చోరీలు

గతంలో ఈ ముఠా చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మేకలను, గొర్రెలను దొంగతనం చేయడానికి రెక్కీకి వచ్చారు. ఇప్పటికే జిల్లా పరిధిలోని నవాబుపేట్‌లో, పరిగిలోని రూప్‌ఖాన్‌పేట్ గ్రామంలో, చన్గోముల్ పీఎస్‌లోని ఎన్కేపల్లి, గోంగుపల్లి, కంకల్ గ్రామాల్లో, ధారూరు పీఎస్ పరిధిలోని మైలారంలో, కుల్కచర్లలోని చెల్లాపూర్‌లో గొర్రెలను ఎత్తుకెళ్లారు. మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల్, వనపర్తి, నారాయణపేట్, నాగర్‌కర్నూల్ జిల్లాలే కాకుండా కర్ణాటకలోని రాయచూర్, బల్లారి, బీదర్, యాద్గిర్, కొప్పల్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో చోరీలను పాల్పడినట్లు ముఠా సభ్యుల్లో ప్రభు, కైలాశ్ చౌహన్ అంగీకరించారు. వారి వద్ద రెండు స్కార్పియో వాహనాలు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగతా తొమ్మిది మంది పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీసీఎస్ సీఐ బల్వంతయ్య, చన్గోముల్ ఎస్ఐ వెల్లడించారు.

అయ్యో పాపం!

- నీటికుంటలో శిశువు మృతదేహం
- గోకఫసల్‌వాద్‌లో విషాదం



శిశువు మృతదేహం

దౌల్తాబాద్: తల్లి పొత్తిళ్లలో సేదతీరాల్సిన నవజాత శిశువు నీటికుంటలో విగతజీవిగా కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ విషాద సంఘటన దౌల్తాబాద్ మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన ఆడ శిశువును గోకఫసల్‌వాద్ పంచాయతీ శివారులోని తంగేడు కుంటలో పడేశారు. అటుగా వెళ్లే గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవిగౌడ్ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించగా.. అప్పుడే పుట్టిన శిశువు మృతి చెంది ఎండిపోయిన కొబ్బరిమట్టపై ఉంది. ఆడబిడ్డ భారమవుతుందనో.. తమకు అడ్డుగా ఉంటుందనో కన్నవారు నీటికుంటలో పడేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారుణ ఘటనపై స్థానిక కారోబార్ మాల నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బడ్జెట్ రాక.. పనులు సాగక!



అసంపూర్తి భవనం వద్ద గ్రామస్తులు

- పథకాల పేర్లు మారడంతో అవస్థలు
- పాఠశాలలో అసంపూర్తిగా అదనపు గదుల భవనం

బొంరాస్‌పేట: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న బొంరాస్‌పేట మండలంలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. ఎనిమిదో తరగతి వరకు ఉన్న బడిలో శుచి, శుభ్రత సమస్యలు వెక్కిరిస్తున్నాయి. పథకాల పేర్లు మారాయనే నెపంతో పాఠశాలలో అదనపు గదుల భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

నిధుల మంజూరుకు అడ్డంకులు

గ్రామంలో ఒకే చోట ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీకేంద్రం, గ్రామ సచివాలయం భవనాలున్నాయి. పాఠశాలలో 101 మంది విద్యార్థులు, ‘మన ఊరు మనబడి’ కింద పాఠశాల ఆవరణలో గతేడాది రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరయ్యాయి. అందులోనే రూ.4 లక్షలతో కిచెన్‌షెడ్ (వంటగది) కూడా నిర్మిస్తున్నారు. అంతలోనే అమ్మ ఆదర్శపాఠశాలగా పథకం పేరు మారడంతో నిధుల మంజూరుకు అడ్డంకులు ఏర్పడ్డాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీంతో అదనపు తరగతుల నిర్మాణం అసంపూర్తి దశలో ఉండిపోయింది. అలాగే పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు శిథిలమయ్యాయి. బాలికలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెండింగ్ పనులపై ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మరుగుదొడ్లు

బాలికలకు తీవ్ర ఇబ్బంది



పాఠశాలలో బాలికలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. మరుగుదొడ్లు, మూత్రశాలల తలుపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాటి గోడలకు మరమ్మతులు చేయాలి. పాఠశాల పరిసరాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వెంటనే దీనిపై అధికారులు స్పందించాలి.

– జ్యోతి, ఉపాధ్యాయురాలు, ఎన్కేపల్లి

బడ్జెట్ లేదని ఆగింది



ఊరిలో పనులేవి సక్రమంగా సాగడంలేదు. రూ.22 లక్షలకుపైగా నిధులు పెట్టి పాఠశాలలో అదనపు తరగతి భవనం నిర్మించాం. ఇప్పటి వరకు పూర్తి బిల్లు మంజూరు కాలేదు. బడ్జెట్ లేదనే కారణంతో హైదరాబాద్‌లో కమిషనర్ వద్ద ఫైల్ ఆగింది.

– పూజారి నర్సింలు, ఎన్కేపల్లి

మంచు విష్ణుకు సైబర్ వేధింపులు

- కేసు నమోదు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు
- నిందితుడికి నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణుకు సైబర్ వేధింపులు తప్పలేదు. సోషల్‌మీడియా ద్వారా ఈ పని చేస్తున్న విజయ్ చంద్రహాసన్ దేవరకొండను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నోటీసులు జారీ చేసి పంపారు. నేరం నిరూపణకు అవసరమైన ఆధారాలు సేకరించి, నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయాలని నిర్ణయించారు. విజయ్ చంద్రహాసన్ ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వివిధ సోషల్‌మీడియా ఖాతాల్లో అనేక వీడియోలు అప్‌లోడ్ చేశారు. వీటిలో మంచు విష్ణు, ఆయనకు సంబంధించిన నిర్మాణ సంస్థ, ‘మా’లతో పాటు సినీ రంగాన్నీ కించపరిచే, అవమానించే, అభ్యంతరకరంగా చిత్రీకరించే అంశాలను పొందుపరిచాడు. ఇతను పదేపదే ఇదే పంథా అనుసరిస్తుండటాన్ని ‘మా’ సీరియస్‌గా తీసుకుంది. సంస్థ ట్రెజరర్ శివబాలాజీ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.మధులత సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. దీంతో అతడికి నోటీసులు జారీ చేసిన అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. త్వరలోనే అవసరమైన ఆధారాలను సేకరించి, న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని నిర్ణయించారు.